క్లుప్తంగా

ఐకమత్యంతోనే అభివృద్ధి

నంద్యాల(అర్బన్): ఐకమత్యంతోనే వడ్డెర సామాజిక వర్గం అభివృద్ధి సాధ్యమవుతుందని ఆ సంఘం జిల్లా గౌరవాధ్యక్షులు పెద్ద వెంకటేశ్వర్లు, చిన్న వెంకటసుబ్బయ్య తెలిపారు. స్థానిక సంఘం కార్యాలయంలో శుక్రవారం వడ్డెరాజుల అన్నదాన సత్రం క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ మహానందీశ్వర ఆలయ పరిసరాల్లో వడ్డెర సత్రం నిర్మించాలని తలంచామని చెప్పారు. నాయకులు వెంకటస్వామి, గోపాల్, మద్దిలేటి, రామాంజనేయులు, చల్లా వెంకటేష్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల బదిలీ

ఉయ్యాలవాడ : మండలంలోని వివిధ పాఠశాలల్లో విధులు నిర్వర్తిస్తున్న ఉపాధ్యాయులకు పదోన్నతలు కల్పించి పది మందిని బదిలీ చేసినట్లు ఎంఈఓ అనురాధ తెలిపారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ హరివరం, కాకరవాడ, ఇంజేడు, సర్వాయిపల్లె, గోవిందపల్లె, ఆర్.జంబులదిన్నెలో ఒక్కొక్కరు చొప్పున, పుచ్చకాయలపల్లె, అల్లూరులో ఇద్దరు ప్రకారం బదిలీ అయ్యారని, అలాగే ఇతర మండలాల నుంచి ఆరుగురు ఉపాధ్యాయులు మండలానికి బదిలీపై వచ్చారని వివరించారు.

ఘనంగా శ్రీకృష్ణదేవరాయుల జయంతి



శ్రీకృష్ణదేవరాయలు విగ్రహానికి పూలమాల వేస్తున్న దృశ్యం

ఆళ్లగడ్డ: విజయనగర సామ్రాజ్యాధీశుడు శ్రీకృష్ణదేవరాయుల జయంతిని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. నియోజకవర్గ బలిజ సంఘం ఆధ్వర్యంలో పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సంఘం నాయకులు శెట్టి విజయకుమార్, ఎంపీపీ వీరభద్రుడు, సిద్ధి సత్యం, యామా గుర్రప్ప, మల్లయ్య ఉన్నారు.

కాళికాంబకు ప్రత్యేక పూజలు



నంద్యాల(వ్యవసాయం): స్థానిక గాంధీచౌక్‌లో వెలసిన శ్రీకాళికాంబ చంద్రశేఖర స్వామి దేవస్థానంలో శుక్రవారం మాఘ మాసం సందర్భంగా కాళికాంబదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి మూలవిరాట్‌కు ఉదయం సుప్రభాతసేవ, పంచామృతాభిషేకం అనంతరం పట్టువస్త్రాలతో అలంకరించారు. అమ్మవారికి ఒడి బియ్యం కార్యక్రమాన్ని నిర్వహించి మహామంగళ హారతులు ఇచ్చారు. సాయంత్రం అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించిన పల్లకీలో ఆశీనులు గావించి ఆలయ ప్రాకారంలో ప్రదక్షిణ చేపట్టారు. ఈఓ లక్ష్మీనారాయణ, ఆరవేటి వాసు, విజయ్‌కుమార్, నరసింహ, అంబరీష్, అర్చకులు సుబ్బాచారి, రాఘవేంద్రాచారి, సుబ్రహ్మణ్యం శాస్త్రి పాల్గొన్నారు.

నేడు శ్రీశైలంలో సూర్యారాధన

శ్రీశైలంటెంపుల్: రథసప్తమి పర్వదినాన్ని పురస్కరించుకుని శనివారం శ్రీశైల ఆలయప్రాంగాణంలోని అక్కమహాదేవి అలంకార మండపంలో సూర్యారాధన కార్యక్రమం నిర్వహించనున్నారు. శ్రీశైలదేవస్థానం ఆధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు, వేదపండితులు లోకకల్యాణాన్ని కాంక్షిస్తూ సంకల్పం పఠిస్తారు. అనంతరం కలశస్థాపన చేసి కార్యక్రమం నిర్విఘ్నంగా జరగాలని మహాగణపతి పూజ జరిపిస్తారు. కార్యక్రమంలో భాగంగా సూర్య మంత్రపూజ, సూర్యనమస్కారాలు, అరుణపారాయణం, వేదపారాయణం జరిపిస్తారు.

పంచాయతీ కార్యదర్శికి సన్మానం

నంద్యాల(రూరల్): మండలంలోని చాబోలు గ్రామ పంచాయతీ కార్యదర్శి మల్లి నరేంద్రకుమార్‌ను సర్పంచ్ మౌనిక, ఉప సర్పంచ్ హుసేన్ బాషా ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా సన్మానించారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా పంచాయతీ కార్యదర్శికి కలెక్టర్ నుంచి మొమెంటో, ప్రశంసా పత్రం పొందారు. ఈ సందర్భంగా అధికారులు,నాయకులు సన్మానించారు.

భ్రామరీకి ఊంజలసేవ



అమ్మవారికి ఊయలసేవ నిర్వహిస్తున్న ఆలయ అధికారి, అర్చకులు

శ్రీశైలంటెంపుల్: అష్టాదశ శక్తిపీఠంగా వెలసిన శ్రీశైల భ్రమరాంబాదేవికి దేవస్థాన అర్చకులు శాస్త్రోక్తంగా ఊయలసేవ నిర్వహించారు. శుక్రవారం సాయంత్రం 7 గంటలకు ఈ కార్యక్రమం ప్రారంభించారు. సేవలో భాగంగా లోకకల్యాణాన్ని కాంక్షిస్తూ అర్చకస్వాములు ముందుగా సేవా సంకల్పాన్ని పఠించారు. కార్యక్రమం నిర్విఘ్నంగా జరగాలని మహాగణపతిపూజ చేశారు. ఊయలలో స్వామి అమ్మవార్లను ఆశీనులను చేసి షోడశోపచార పూజలు నిర్వహించి అమ్మవారికి అష్టోత్తరం, త్రిశతి, ఖడ్గమాల, సహస్రనామ పూజలు జరిపించారు. అలాగే శ్రీశైలగ్రామ దేవతగా పిలవబడుతున్న అంకాళమ్మకు విశేషపూజలు నిర్వహించారు.

పాఠ్యాంశంగా పార్వేటోత్సవం

- 7వ తరగతి విద్యార్థులకు పాఠ్యాంశంగా అహోబిలేశుడి విశిష్టత



పల్లకీలో కొలువైన ఉత్సవమూర్తులు



పాదరక్షలు లేకుండా పల్లకీ మోస్తున్న బోయిలు

రుద్రవరం: ప్రపంచంలోని 108 దివ్య క్షేత్రాల్లో నవ నారసింహులు కొలువైన అహోబిల క్షేత్రం ఒకటి. ఏటా సంక్రాంతి పర్వదినం మరుసటి రోజున ఉత్సవమూర్తులైన శ్రీ జ్వాలా నరసింహస్వామి, శ్రీ ప్రహ్లాదవరద స్వామి వారు పల్లకీలో కొలువై అహోబిలం నుంచి పార్వేటకు బయలు దేరడం ఆనవాయితీగా సాగుతోంది. పార్వేట మహోత్సం లో ఎన్నో ప్రత్యేకతలు, విశిష్టతలు కల్గినందుకే ప్రభుత్వం 7వ తరగతి తెలుగు పాఠ్యపుస్తకంలో పాఠ్యాంశంగా చేర్చింది.

పార్వేట ఇలా..

హిరణ్యకశిపుడిని వధించిన అనంతరం స్వామి వారు ఉగ్రరూపంతో కొండలు కోనల్లో తిరుగాడే వారు. ఆ రూపం నుంచి స్వామిని శాంతింపజేసేందుకు దేవతలు చేసిన ప్రయత్నంలో భాగంగా లక్ష్మీదేవి చెంచులక్ష్మిగా అవతరించి అహోబిలం అడవుల్లో తిరుగాడుతున్న ఉగ్రనారసింహుడికి తారసపడతారు. అమ్మవారిని చూసిన స్వామి వారు ఆమెను వివాహమాడాలని నిశ్చయించుకోగా.. చెంచులు తమ తోబుట్టుని పెళ్లాడలంటే వోలి (సుంకం) చెల్లించాలని పట్టుబడతారు. తన వద్ద ఏమి లేదని.. బయటకు వెళ్లి తీసుకొస్తానని స్వామి వారు చుట్టు పక్కల గ్రామాలకు వెళ్లి ధన ధాన్యాలు సేకరించుకొని, అహోబిలంలో జరిగే తమ కల్యాణానికి అందరూ తరలి రావాలని ఆయా గ్రామాల ప్రజలకు పిలుపునిచ్చి తిరిగి వస్తారు. అలా స్వామి వారు వెళ్లి రావడమే పార్వేటగా మారిందనేది స్థానిక పురాణం

పూజల్లో అగ్రస్థానం చెంచులకే..

చెంచుల తోబుట్టువు అయిన చెంచులక్ష్మి అమ్మవారిని కల్యాణమాడే వరకు జరిగే పూజల్లో అగ్ర స్థానం చెంచులకే కేటాయించారు. పార్వేటకు ముందు అహోబిలంలోని రెండు కాలనీల చెంచులు అడవికి వెళ్లి ఆకులు సేకరించి తోరణాలుగా కూర్చి ఎగువ,దిగువ ఆలయాలను అలంకరిస్తారు. రాత్రి ఉత్సవమూర్తులు పార్వేటకు బయలు దేరే ముందు వారు ఆలయానికి చేరుకొని నృత్యాలు చేస్తు అందరిని అలరించిన అనంతరం స్వామి వారికి మొదటి పూజ చేసి సాగనంపుతారు. అలాగే బ్రహ్మోత్సవాల పూజల్లోను వారికి ప్రథమ స్థానం ఇచ్చారు.

నియమ నిష్టలతో..

బోయీలు నియమ నిష్టలతో స్వామి వారి పార్వేట పల్లకీని మోస్తున్నారు. పల్లకీ మోసే వారు పార్వేటోత్సవం పూర్తయ్యే వరకు పాదరక్షలు ధరించరాదని నియమం. అలాగే వ్యసనాలకు దూరంగా ఉండాలి. అహోబిలం నుంచి బయలుదేరిన 40 రోజుల పాటు పర్యటించడంతో స్వామి వారు అలిసిపోతారు. ఆ అలసటను పోగొట్టేందుకు అర్చక బృందం మూడు చోట్ల అభిషేకం (వస్త్రమార్పిడి) చేస్తారు. మొదటి విడత ఉయ్యాలవాడలో స్వామి పులకాపం చేసి పట్టు వస్త్రాలు పూలమాలలతో ప్రత్యేకంగా అలంకరిస్తారు. టీ.లింగదిన్నె,రుద్రవరం గ్రామాల్లో మరోసారి పులకాపం చేస్తారు. గతంలో నైవేద్యం గ్రామాల్లోని బావుల నుంచి నీటితో అక్కడే వండి స్వామి వారికి సమర్పించే వారు. ప్రస్తుతం బావులు లేకపోవడంతో అహోబిలం నుంచి తీసుకొస్తున్నారు.

గ్రామాల్లో పండుగ వాతవరణం..

స్వామి వారి పల్లకీ వెళ్లిన గ్రామాల్లో పండుగ వాతావరణం నెలకొంటుంది. లోగిళ్లు బంధుమిత్రులతో కళకళలాడుతాయి. ముఖ్యంగా ఆడపడుచులను ఆహ్వానించడం ఆనవాయితీ. స్వామి వార్లకు పిండి వంటలతో నైవేద్యం సమర్పించి పూజలు చేస్తారు. ఈ సందర్భంగా గ్రామంలో దుకాణాలు, రంగు రాట్నాలు వంటివి వెలుస్తాయి.

స్వామి వెంట పరివారం..

సంక్రాంతి పండుగకు నెల రోజులు ముందే ప్రకాశం జిల్లా గిద్దలూరుతో పాటు చుట్టు పక్కల గ్రామాలకు చెందిన దాదాపు 50 కుటుంబాలు పెంపుడు జంతువులతో సహా అహోబిలానికి కాలినడకన బయలుదేరి వస్తారు. బ్రహ్మోత్సవాలు ముగిసే వరకు స్వామి వారి వెంటే ఉంటారు. గ్రామాల్లో పల్లకీతో పాటు వెళ్లి భిక్ష మెత్తుకొని జీవనం సాగిస్తారు.



5. అహోబిలం పార్వేట ఉత్సవం

"హరినామమే కడు ఆనందకరము" అని నిత్యం తనని పూజించే భక్తుడు ప్రహ్లాదుణ్ణి రక్షించడానికి శ్రీమహావిష్ణువు నరసింహుడిగా అహోబిలంలో అవతరించాడు. అహోబిలం కర్నూలు జిల్లాలో ఉంది. స్వామి ఉగ్ర రూపాన్ని చూసిన దేవదానవులు అహో బలం ....అహో బలం అని ఆశ్చర్యపోయారు. అదే కాలక్రమేణా 'అహోబిలం' అనే పేరుతో స్థిరపడింది. ఇక్కడ కొలువైన నరసింహస్వామివారి దేవేరి చెంచులక్ష్మి.

ప్రతి సంవత్సరం ఫాల్గుణ శుద్ధ పౌర్ణమినాడు నరసింహుని కళ్యాణోత్సవం వైభవంగా జరుగుతుంది. ప్రతి దేవాలయంలోను కళ్యాణోత్సవం జరగడం ఆనవాయితీగా వస్తుంది. కాని అహోబిలంలో జరిగే కళ్యాణోత్సవానికి ఒక ప్రత్యేకత ఉంది. సంక్రాంతి వరకు దేవాలయంలో ఉన్న స్వామివారు కనుమనాడు ఉత్సవ మూర్తిగా దేవాలయం వెలుపలకి వస్తారు. ఈ క్రమంలో అహోబిలం చుట్టుపక్కల ఉన్న 35 గ్రామాలలో 41 రోజులపాటు ప్రతీ ఇంటినీ సందర్శిస్తారు. ఫాల్గుణ శుద్ధ పౌర్ణమినాడు జరిగే తన కళ్యాణోత్సవానికి రమ్మని ప్రజలను ఆహ్వానిస్తారు.

7వ తరగతి పాఠ్యంశంలో ఉన్న అహోబిలం పార్వేట విశిష్టత

మొక్కజొన్న పంటపై అడవి పందుల దాడి



అడవి పందులు నాశనం చేసిన మొక్కజొన్న పంటను చూపుతున్న రైతు

రుద్రవరం: మండల కేంద్రానికి చెందిన సుభాహన్ అనే రైతు సాగు చేసిన మొక్కజొన్న పంటను అడవి పందులు నాశనం చేశాయి. బాధిత రైతు మాట్లాడుతూ దాదాపు రూ.లక్ష పెట్టుబడితో అడవికి దగ్గరలో ఉన్న మూడున్నర ఎకరాల్లో మొక్కజొన్న పంట సాగు చేశానన్నారు. ప్రస్తుతం పంట కంకి దశలో ఉందని, మంచి దిగుబడులు వచ్చే అవకాశముందని ఆశపడ్డామని, ఈ సమయంలో అడవి పందులు పంటను నాశనం చేశాయని వాపోయారు. దాదాపు 1.5 ఎకరాల్లో పంట నష్టపోయానని, అటవీ శాఖ అధికారులు స్పందించి తనకు నష్ట పరిహారం అందించి ఆదుకోవాలని కోరాడు.

ముగిసిన ప్రతిష్ఠోత్సవాలు



నూతన ఆలయంలో ధ్వజ స్తంభాన్ని ప్రతిష్ఠించిన దృశ్యం

రుద్రవరం: స్థానిక వేంకటేశ్వరస్వామి ఆలయంలో జరుగుతున్న విగ్రహ, ధ్వజ స్తంభ ప్రతిష్ఠోత్సవాలు శుక్రవారం ముగిశాయి. ఐదు రోజుల పాటు పండితుల వేద మంత్రోచ్చారణలతో వివిధ రకాల పూజలు, హోమాలు జరిపించారు. చివరి రోజు శాస్త్రోక్తంగా వివిధ దేవతా మూర్తులు, ధ్వజ, కలశ ప్రతిష్ఠించారు. గ్రామానికి చెందిన వారే కాకుండా వివిధ గ్రామాల నుంచి వచ్చిన భక్తులు ఆలయంలో పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు.

విధులు సక్రమంగా నిర్వర్తించండి

రుద్రవరం: గ్రామ సచివాలయ ఉద్యోగులు విధులు సక్రమంగా నిర్వర్తించాలని ఎంపీడీఓ మధుసూదన్ రెడ్డి సూచించారు. శుక్రవారం మండలంలోని మందలూరు,ఆర్.నాగులవరం గ్రామ సచివాలయాలను సందర్శించి సిబ్బంది పనితీరు, రికార్డుల నిర్వాహణ, స్పందన సమస్యల పరిష్కారం వంటి వాటిని పరిశీలించారు. అలాగే ఆయా గ్రామాల్లో సాగుతున్న గృహ నిర్మాణాలను పరిశీలించారు. ఆయన సిబ్బందికి పలు సూచనలు చేశారు. ప్రతి ఉద్యోగి సమయ పాలన పాటిస్తూ సమస్యల పరిష్కారం కోసం సచివాలయానికి వచ్చే వారితో మర్యాద పూర్వకంగా మెలగాలని చెప్పారు. పీఆర్ ఏఈ వెంకటరాముడు,హౌసింగ్ ఏఈ నాగరాజు ఉన్నారు.

బస్సు ఢీకొని మహిళకు గాయాలు



బస్సు ఢీకొని గాయాలైన మహిళ ఉమాదేవి

ఆత్మకూరు: బస్సు ఢీకొని ఆత్మకూరు మండలం బాపనంతాపురం గ్రామానికి చెందిన మహిళ ఉమాదేవికి గాయాలయ్యాయి. ఈమె స్వగ్రామం నుంచి కర్నూలుకు వెళ్లేందుకు శుక్రవారం ఉదయం ఆత్మకూరుకు చేరుకుంది. బస్టాండ్ ఆవరణలో బస్సు కోసం ఎదురుచూస్తుంది. ఈక్రమంలో స్థానిక డిపోకు చెందిన బస్సు ఆమెను ఢీకొనడంతో రక్త గాయాలయ్యాయి. వెంటనే క్షతగాత్రురాలిని స్థానికులు ఆత్మకూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

ప్లాస్టిక్ వినియోగం తగ్గించాలి



బట్ట, జ్యూట్ బ్యాగ్‌లను చూపుతున్న మున్సిపల్ అధికారులు, వ్యాపారులు

నంద్యాల(సిటీ): ప్లాస్టిక్ వాడకంతో ఎన్నో అనర్థాలు జరుగుతాయని, వినియోగదారులు, వ్యాపారులు వాడకాన్ని తగ్గించి పర్యావరణ సంరక్షణకు తోడ్పాటునివ్వాలని మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి తెలిపారు. స్థానిక కార్యాలయంలో శుక్రవారం ప్లాస్టిక్ వాడకం, అనర్థాలపై వ్యాపారులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించేలా వినియోగదారుల్లో అవగాహన కల్పించాలని సూచించారు. ఇందు కోసం ప్రతి సచివాలయంలో టాస్క్‌ఫోర్స్ కమిటీని ఏర్పాటు చేస్తున్నామని, ప్లాస్టిక్ వాడితే వచ్చే అనర్థాలను టాస్క్‌ఫోర్స్ కమిటీ ప్రజలకు వివరిస్తుందని చెప్పారు. జ్యూట్, బట్ట బ్యాగ్‌లు వాడి పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని కోరారు. డాక్టర్ అంకిరెడ్డి, శానిటరీ సూపర్ వైజర్ లక్ష్మీనారాయణ, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శివప్రసాద రెడ్డి, మర్చెంట్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్యస్వామికి షష్ఠి పూజలు

శ్రీశైలంటెంపుల్: షష్ఠి పర్వదినాన్ని పురస్కరించుకుని శుక్రవారం శ్రీశైల దేవస్థానం ఆధ్వర్యంలో సుబ్రహ్మణ్యస్వామికి విశేషపూజలు నిర్వహించారు. ముందుగా లోకకల్యాణం కోసం అర్చకస్వాములు సంకల్పం పఠించి, మహాగణపతిపూజ జరిపించారు. అనంతరం సుబ్రహ్మణ్యస్వామికి అభిషేకం, అష్టోత్తరము, స్తోత్రము, పారాయణలు చేశారు.

పల్లకీలో మహానందీశ్వరుడు



పల్లకోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

మహానంది: శ్రీ గంగా, కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామి వార్లు శుక్రవారం రాత్రి పల్లకీలో కొలువై విహరించారు. ఈఓ చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో పండితులు, అర్చకులు స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించారు. స్థానిక అలంకార మండపంలో గణపతిపూజ, పుణ్యాహవాచనం, అలంకార హారతులు చేపట్టారు. తర్వాత ఆలయ ప్రాకారాల్లో పల్లకోత్సవం నిర్వహించారు.

నృత్యనీరాజనం



శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం ధర్మపథం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం నిత్యకళావేదికపై ఏర్పాటు చేసిన సంప్రదాయ నృత్య ప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది. నందికొట్కూర్‌కు చెందిన సాయిలక్షిత శ్రీ, లక్షిత శ్రీ నృత్యకళాశాల కళాకారులు మహాగణపతిమ్, శివాశివాష్టకం, శివ తాండవం, శివస్తుతి, శంభోశివ శంభో తదితర భక్తి గీతాలకు నృత్యప్రదర్శన చేశారు.

శ్రీశైలదేవస్థానానికి విరాళం



దాతకు ప్రసాదం, బాండ్ అందజేస్తున్న దృశ్యం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం భక్తుల సౌకర్యార్థం నిర్వహిస్తున్న వివిధ పథకాలకు శుక్రవారం కర్ణాటకకు చెందిన భక్తులు విరాళాలు అందించారు. అన్నదాన పథకానికి బెంగళూరుకు చెందిన సి.పుష్పలత రూ.1,00,116 , గోసంరక్షణనిధి పథకానికి సి.నరసింహులు రూ.1,00,116 చొప్పున అందించారు. దాతలను దేవస్థానం తరపున స్వామివారి శేష వస్త్రాలను, లడ్డూప్రసాదాలను అందించి సత్కరించారు.

కేంద్ర ప్రభుత్వానికి బుద్ధి చెబుదాం



క్యాలెండర్‌ను విడుదల చేస్తున్న దృశ్యం

నంద్యాల(అర్బన్): ప్రత్యేక హోదా, విభజన హామీలను మరిచిన కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి తగిన సమయంలో ప్రజలు బుద్ధి చెబుతారని విభజన హామీల సాధన కమిటీ చైర్మన్ చలసాని శ్రీనివాస్ తెలిపారు. ప్రత్యేక హోదా, విభజన హామీల అమలు కోరుతూ ప్రజాసంఘాల నాయకులు చేపట్టిన సమరయాత్ర శుక్రవారం నంద్యాలకు చేరింది. ఈ సందర్భంగా డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ, ఏఐవైఎఫ్, ఏఐఎస్ఎఫ్ నాయకులు సమరయాత్ర నాయకులు డీవైఎఫ్ఐ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. చలసాని మాట్లాడుతూ ఏపీకి ప్రత్యేక హోదా, విభజన హామీలు అమలు చేయాలని, సమరయాత్రను నిర్వహిస్తున్నామన్నారు. బీజేపీ ప్రభుత్వం ఇప్పటికైనా ప్రత్యేక హోదా ఇచ్చి రాష్ట్రానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి రామన్న, ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లెనిన్ బాబు, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు ప్రసన్న, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు జానస్సర్, శివారెడ్డి, రాజశేఖర్, క్రాంతికుమార్, లక్ష్మణ్, శివ, నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.

నియమాలు పాటించండి.. ప్రమాదాలను నివారించండి



డ్రైవర్లకు ప్రశంసా పత్రాలను అందజేస్తున్న దృశ్యం

నంద్యాల(వ్యవసాయం): రోడ్డు భద్రతా నియమాలు పాటించండి.. ప్రమాదాలను నివారించండి అని ట్రాఫిక్ సీఐ నరేష్‌బాబు ఆర్టీసీ డ్రైవర్లకు సూచించారు. శుక్రవారం రోడ్డు భద్రతా వారోత్సవాల ప్రారంభోత్సవ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించి రోడ్డు ప్రమాదాల నివారణకు తమ వంతు కృషి చేయాలన్నారు. జాతీయ రహదారిపై ప్రయాణం చేసే వారు సెల్‌ఫోన్లను వాడకూడదని సూచించారు. ప్రాణం ఎంతో విలువైందని, వాహనాలు నడిపేటప్పుడు బాధ్యతగా వ్యవహరించాలని కోరారు. అనంతరం ఉత్తమ డ్రైవర్లకు ప్రశంసా పత్రాలు అందజేశారు. డిపో మేనేజర్ గంగాధర్‌రావు, అసిస్టెంట్ మేనేజర్ మద్దిలేటి నాయుడు, తిమ్మయ్య, డిపో సిబ్బంది, డ్రైవర్లు, అసోసియేషన్ నాయకులు పాల్గొన్నారు.

వైభవంగా షష్టి ఉత్సవాలు



శ్రీచక్రాన్ని ఫలాలతో అలంకరించిన దృశ్యం

పాణ్యం: మండల పరిధిలోని కొత్తూరు గ్రామంలో వెలసిన శ్రీ వల్లి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి షష్టి(జన్మ దిన) వేడుకలు వైభవంగా జరిగాయి. శుక్రవారం తెల్లవారుజామున నుంచి అర్చకులు స్వామి వారికి శాస్త్రోక్తంగా విశిష్ఠ పూజలు, అభిషేకాలు, అర్చనలు చేపట్టారు. ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కల్యాణమండపంలో ఉత్సవమూర్తులకు ఘనంగా కల్యాణం నిర్వహించారు. స్వామి కల్యాణాన్ని తిలకించేందుకు మహిళలు, భక్తులు వేలాదిగా తరలివచ్చారు. ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి, ఆయన సతీమణి కాటసాని ఉమామహేశ్వరమ్మ, కుమారుడు కాటసాని శివనరసింహారెడ్డిలు కల్యాణంలో పాల్గొన్నారు. ఎమ్మెల్యే దంపతుల చేతుల మీదుగా స్వామివారి కల్యాణోత్సవం నిర్వహించారు. షష్టి వేడుకలను పురస్కరించుకొని ఆలయాన్ని పూలు, పండ్లు, మామిడి తోరణాలు, అరటి బొదెలు, విద్యుత్ దీపాలతో ముస్తాబు చేశారు. ఆలయ గర్భాలయంలో ఉన్న పైకప్పు శ్రీ చక్రాన్ని ఫలములతో అలంకరించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ సద్దల సూర్యనారాయణరెడ్డి, వైఎస్సార్‌సీపీ అవుకు మండల కన్వీనర్ కాటసాని తిరుపాల్‌రెడ్డి, ఈఓ రామకృష్ణ, అర్చకులు వీరయ్య, నారాయణ, సురేష్ పాల్గొన్నారు.

వెండి పడగ బహూకరణ



సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి వెండి పడిగె బహూకరించి పూజ చేస్తున్న దాత కుటుంబ సభ్యులు

పాణ్యం: కొత్తూరు గ్రామంలో వెలసిన శ్రీవల్లి సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి 21 కేజీల వెండి నాగ పడగను భక్తులు అందించినట్లు ఆలయ ఈఓ రామకృష్ణ శుక్రవారం తెలిపారు. బనగానపల్లె మండలం పలుకూరు గ్రామానికి చెందిన శనివారపు వెంకటరామిరెడ్డి, శనివారపు దస్తగిరిరెడ్డి, ఆయన కుమారుడు శనివారపు కొండారెడ్డి, శ్వేత దంపతులు స్వామి వారికి వెండి పడగతో పాటు 30 గ్రాముల బంగారు కళ్లు, మీసం బహూకరించారన్నారు. అనంతరం దాతలకు శేషవస్త్రాలతో సన్మానించినట్లు తెలిపారు.

జోరుగా వరి నాట్లు

- 1,046 హెక్టార్లలో వరిసాగు
- బిజీగా రైతులు, కూలీలు



శ్రీనివాసపురం వద్ద వరి నాట్లు వేస్తున్న దృశ్యం



శ్రీనివాసపురం వద్ద నాటుకు సిద్ధంగా ఉన్న నారుమడి

గోస్పాడు: రబీలో భాగంగా మండలంలోని గ్రామాల్లో రైతులు వరి పంట సాగులో బిజీగా ఉన్నారు. ఏటా రెండో పంటగా కూడా వరి సాగు చేయడం ఇక్కడ సాధారణం. ఈ ఏడాదికి కూడా దీబగుంట్ల, కానాలపల్లె, నెహ్రూనగర్, జిల్లెల్ల, యాళ్లూరు, శ్రీనివాసపురం, జూలేపల్లె, పసురపాడు, బీవీనగర్ తదితర గ్రామాల్లో రైతులు వరి పంట సాగు చేస్తున్నారు. సాధారణ విస్తీర్ణం 887 హెక్టార్లు కాగా రైతులు 1,046 హెక్టార్లలో పంట సాగు చేశారు. సాధారణం కంటే సాగు చేసిన పైరు విస్తీర్ణం పెరిగిందని అధికారులు పేర్కొంటున్నారు. అలాగే ఖరీఫ్‌లో కూడా సాధారణ విస్తీర్ణానికి మించి పంట సాగు చేశారు. ఈ ఏడాది వడ్లకు మార్కెట్లో మంచి ధర ఉండటంతో పాటు తెగుళ్లు తక్కువగా ఆశించడం,దిగుబడులు ఆశించిన స్థాయిలో రావడంతో వరి సాగుపై రైతులు ఆసక్తి చూపుతున్నారు. ఖరీఫ్ కోతలకు ముందుగా వరి నారుమళ్లు సిద్ధం చేసుకున్నారు. కోతలు పూర్తయిన వెంటనే పొలాల్లో బురద సేద్యం చేసి నాట్లు వేస్తున్నారు.

ఎరువుల కొరత లేదు



రైతులకు ఎరువుల కొరత రాకుండా ముందస్తు చర్యలు చేపట్టాం. ఖరీఫ్‌లో కూడా రైతులకు అవసరమైన మందులను అందుబాటులో ఉంచాం. ఎరువులు, పురుగు మందులను రైతులకు అవసరమైన వరకు అందుబాటులో ఉండేలా చేస్తాం. సరైన సస్యరక్షణ పద్ధతులు రైతులు అనుసరిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చు.

–అబ్దుల్‌హక్, వ్యవసాయాధికారి, గోస్పాడు

భద్రావతి భావనారాయణ స్వామికి పుష్పార్చన



విష్ణు సహస్ర నామార్చనలో పాల్గొన్న భక్తులు

నంద్యాల(వ్యవసాయం): పద్మశాలీయ సంఘం ఆధ్వర్యంలో భద్రావతి భావ నారాయణ కల్యాణ మండపంలో శుక్రవారం స్వామి వారి కల్యాణాన్ని పురస్కరించుకొని రెండో రోజు స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయాన్నే మూలవిరాట్‌కు సుప్రభాతసేవ, పంచామృతాభిషేకాలు నిర్వహించి స్వామి, అమ్మవార్లకు సామూహిక పుష్పార్చన చేపట్టారు. అనంతరం విష్ణు సహస్ర నామం పఠించి మహా మంగళ హారతులు ఇచ్చారు. సంఘం అధ్యక్షుడు వేణుగోపాల్ మాట్లాడుతూ 28వ తేదీన భద్రావతి భావ నారాయణ స్వామి కల్యాణోత్సవం వైభవంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సాయంత్రం శ్రీలలితా సహస్ర నామ కుంకుమార్చన జరిపించారు.